క్లుప్తంగా

జ్యోతిష్య రత్న పురస్కారం



జ్యోతిష్య రత్న అవార్డును అందుకుంటున్న గరుడాద్రి దత్తాత్రేయశర్మ

ఆదోని అర్బన్: కర్ణాటక రాష్ట్రం హుబ్బళిలో విశ్వదర్శన సంస్థ వారు పట్టణానికి చెందిన గరుడాద్రి దత్తాత్రేయశర్మకు ఆదివారం జ్యోతిష్యరత్న పురస్కారాన్ని అందజేశారు. హుబ్బళిలో కమలాపురం రైతు సముదాయ భవనంలో విశ్వవిద్వత్సభలో 8 రాష్ట్రాల నుంచి వచ్చిన ఆయుర్వేద, హోమియోపతి, రక్షణ శాఖ, జ్యోతిష్య, సాహిత్య, సంస్కృత, కన్నడ, తెలుగు, హిందీ మొదలగు రంగాలకు చెందిన భాషా పండితులు, స్వామిజీలు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సిద్ధరూఢ మఠం స్వామిజీ, కోళిగురుమఠం రాజగురువు స్వామిజీ, రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపాల్, విశ్వదర్శిని సంస్థ అధినేత పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీ ధ్వంసం



నాటుసారా తయారీకి ఉపయోగించిన డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని రణమండల కొండలో డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ధీరజ్, వన్‌టౌన్ సీఐ తేజమూర్తి, సిబ్బంది కలిసి కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా కొండలోని నాటుసారా బట్టీపై ఆదివారం దాడులు నిర్వహించారు. బట్టీల వద్ద డ్రమ్ములను ధ్వంసం చేసి నాటుసారా ఊటను నేలపాలు చేశారు. 2 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తేజమూర్తి తెలిపారు.

కాశీలో నృత్య ప్రదర్శన



నిర్వాహకుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న బాలికలు

ఆదోని అర్బన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాశి (కాశీ)లో తాండవ కృష్ణ భారతీయ నృత్యోత్సవ్ ఆధ్వర్యంలో కాశీ నృత్య మహోత్సవం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదోని పట్టణానికి చెందిన శ్రీ గురుకృప నాట్యాలయం నుంచి బాలికలు మనోజ్ఞ, మహతి కూచిపుడి నృత్య ప్రదర్శన చేసి అందరినీ అలరించారు. వివిధ రాష్ట్రాల నుంచి కూచిపుడి, భరతనాట్యం, జానపదం, పేరణి, మోహినినాట్యం, ఆంధ్ర నాట్యం, కథాకళి, ఒడిస్సా, మణిపురి, కోలాటం కళాకారులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన బాలికలు నృత్య ప్రదర్శన చేసి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు, దర్శకుడు నవీన్‌కుమార్ గట్టు, కార్యక్రమ నిర్వాహకులు నాట్యశ్రీ, ఉదయశ్రీ, మనోజ్, గురువు వీరజ్ రాయల్ పాల్గొన్నారు.

1న హుండీ ఆదాయం లెక్కింపు



ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపును జూన్ 1వ తేదీ చేపట్టనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే వారు పంచ, ఉత్తరీయం (టవల్) తప్పక ధరించి హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్



సంప్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంకు రెండు రోజులపాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఉన్న సంప్‌లో ఫిల్టర్‌బెడ్, ట్యాంకు శుభ్రత పనులు చేపడుతుండడంతో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య చెరువు కాంట్రాక్ట్ సిబ్బందితో సంప్, ఫిల్టర్‌బెడ్‌లను శుభ్రపరిచే పనులు చేయిస్తున్నారని, ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

పాడి సంరక్షణకు ప్రాధాన్యం

- సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- నియోజకవర్గ కేంద్రాల్లో అందుబాటులో సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడిరైతులు



ల్యాబ్‌లో పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సిబ్బంది



ఆదోనిలో ఏర్పాటు చేసిన పశు వ్యాధి నిర్ధారణ పరీక్షల కేంద్రం

ఆదోని సెంట్రల్: పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పశువులకు సంక్రమించే వ్యాధులను నిర్ధారిస్తూ వాటి నివారణకు చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాలో అధిక శాతం మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే పశువులకు వ్యాధులు సంక్రమించినప్పుడు సరైన అవగాహన లేని కారణంగా చికిత్స చేయించకపోవడంతో పశు సంపదను కోల్పోతున్నారు. దీన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో 14 పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లను 2021 జూన్ 8వ తేదీన రైతులకు అందుబాటులోకి తెచ్చింది. ప్రతి నెలా ల్యాబ్‌లో 180 చొప్పున పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రతి నెలా లక్ష్యం మేరకు పరీక్షలు చేస్తున్నారు. పశువుల మూత్రం, పేడ, రక్తం, చర్మం, పాలు పరీక్షించడానికి ఆధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేయడానికి ఒక ల్యాబ్ టెక్నీషియన్, అసిస్టెంట్ టెక్నీషియన్, అటెండర్‌ను నియమించారు. ఈ పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలు పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయానికి అనుసంధానంగా పనిచేస్తున్నాయి.

వైద్య పరీక్షలు ఇలా..

ఆదోని డివిజన్‌లో ఆవులు, ఎద్దులు కలిపి 1.20 లక్షలు ఉన్నాయి. గొర్రెలు 80 వేలు, మేకలు 5.84 లక్షలు ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో రైతులకు ఆందోళన లేకుండా పోయింది. గతంలో పశువులకు ఏ చిన్న రోగం వచ్చినా రైతులు అవస్థలు పడేవారు. పశువులకు ఎంత పెద్ద రోగం వచ్చినా స్థానిక వైద్యులతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. పరీక్షలకు సంబంధించిన రిపోర్ట్ వచ్చే లోపు ఇక్కడ పశువులను కోల్పోయేవారు. ప్రభుత్వం ఎక్కడికక్కడే ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో పశువులకు వైద్య పరీక్షలతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి చికిత్సలు అందిస్తున్నారు. కర్నూలు జిల్లాలో జనవరి 2022 నుంచి మార్చి 24 వరకు 37,931 పశువులకు వివిధ రకాల పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అందులో ఆదోనిలో 2006, ఆలూరు - 9050, గుడూరు - 3901, మంత్రాలయం - 5447, పత్తికొండ - 10383, ఎమ్మిగనూరు - 7139 పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇలా

మైక్రోస్కోప్ ద్వారా రక్తం, పేడ పరీక్షలను నిర్వహిస్తారు. దీంతో సూక్ష్మ కణాలను సులువుగా గుర్తించేందుకు అవకాశం ఉంది. సెంట్రిఫ్యూజ్ ద్వారా రక్తంలో సీరం, ప్లాస్మాను వేరు చేయడానికి ఉపయోగపడుతుంది. బయోకెమికల్ ఎనలైజర్ ద్వారా సంబంధిత కిడ్నీ, లివర్, షుగర్ వ్యాధి పరీక్షలను చేస్తారు. ఇంక్యుబేటర్‌ను పశువుల వ్యాధి నిర్ధారణకు సేకరించిన శాంపిల్స్‌కు బ్యాక్టీరియా సోకకుండా ఉండేందుకు ఉపయోగిస్తారు. ఆటోక్లేవ్ ద్వారా పరికరాలను వేడి నీటితో శుభ్రం చేసేందుకు ఉపయోగపడుతుంది.

పాడి రైతులకు ఉపయోగం

పాడి పశువుల మరణాలను తగ్గించి పశు సంపదను వృద్ధిలోకి తీసుకురావడానికి ఈ పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. రైతులు నష్టపోకూడదని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. పశువులకు సోకే చర్మ వ్యాధుల నుంచి బ్రూసెల్ వంటి వ్యాధులకు సంబంధించిన అన్ని పరీక్షలను చేస్తారు. బ్రూసెల్ వ్యాధి నివారణకు 4 నుంచి 8 నెలల వయస్సు పెయ్య దూడలకు టీకాలు వేస్తున్నారు. వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్య సేవలను అందిస్తున్నాం.

– రవిబాబు, పశువ్యాధి నివారణ సహాయ సంచాలకులు, కర్నూలు

సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధి నిర్ధారణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత పాడి రైతులకు సకాలంలో వైద్య సేవలను అందించగలుగుతున్నాం. ల్యాబొరేటరీలో అందుబాటులో లేనప్పుడు నమూనాలను జిల్లా కేంద్రాలకు పంపి వాటి కోసం ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పశువులకు సోకిన వ్యాధులను నిర్ధారించుకోవడానికి రైతులు ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ల్యాబ్‌లు ఉన్నాయి. పాడి రైతులు ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పీవీ రమణ, పశుసంవర్ధక శాఖ డీడీ

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఎల్లార్తిలో కార్డన్ సెర్చ్

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో ఆదివారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది సోదాలు నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సోదాలు (కార్డన్ సెర్చ్) నిర్వహించినట్లు ఎస్ఐ పెద్దయ్యనాయుడు తెలిపారు. గ్రామంలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారితో పాటు అనుమానితులు, ఆయా రాజకీయ పార్టీల నాయకుల ఇళ్లలో సోదాలు జరిపారు. కక్షలు, కార్పణ్యాలతో గొడవలు చేసి శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని.. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం వంటి వాటికి అనుమతి లేదన్నారు.



హాలహర్విలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మోహన్ రెడ్డి

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

నందవరం: జూన్ 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, గొడవలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో పోలీస్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ వేళ గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే శిక్షార్హులవుతారన్నారు. అందరూ కలిసిమెలసి ప్రశాంతంగా జీవించాలన్నారు. ఎస్ఐలు తిమ్మయ్య, శరత్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

హొళగుంద: హొళగుంద బస్టాండ్ నుంచి కోటివీధికి వెళ్లే రోడ్డులో సర్వీస్ వైర్లు వాహనాలకు తగిలేలా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. దీని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో నిత్యం దుకాణాలకు సరుకులు అన్‌లోడ్ చేసేందుకు, పెళ్లి, ఇతర ఊరేగింపులకు లారీలు, ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతుండడం, రోడ్డుకు అడ్డంగా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఆ సమయాల్లో కర్రలతో తీగలను పైకెత్తుకుని ముందుకెళ్లాల్సి వస్తోందని.. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. అదే విధంగా పీహెచ్‌సీ, ఆదోని రోడ్డులోని పలు చోట్ల ప్రమాదకర స్థితిలో విద్యుత్ తీగలు రోడ్డులో వేలాడుతున్నాయని.. వర్షాకాలం ప్రారంభానికే ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హొళగుంద బస్టాండ్-కోటివీధి రోడ్డులో అడ్డదిడ్డంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

అ‘పూర్వ’ కలయిక

మద్దికెర: మిత్రమా కుశలమా అంటూ 1987–88 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 36 ఏళ్ల తరువాత అందరూ కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిక్కన్న, శేఖర్, మురళీ, చంద్ర, భాస్కర్, ప్రభాకర్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.



1987-88 బ్యాచ్ విద్యార్థులు తిరిగి కలుసుకున్న దృశ్యం

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు పరిధిలోని గ్రామాలకు శుద్ధి చేసిన మంచి నీటినే సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఎస్ ట్యాంకును సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు పరిధిలోని పెద్దతుంబళం, కుప్పగల్, బల్లేకల్, పాండవగల్లు, జాలిమంచి, గణేకల్, ఇస్వీ గ్రామాలకు శుద్ధి చేసిన మంచినీటిని సరఫరా చేయాలన్నారు. మైక్రో ఫిల్టర్ గదిలో రెండు సిస్టంలు ఉన్నప్పటికీ అందులో నీరు శుద్ధికావడం లేదన్నారు. చెరువు నుంచి నేరుగా రావాటర్ పంపింగ్ చేస్తున్నారని, దీనివల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. గతంలో ఎన్నోసార్లు అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ఎలాంటి మార్పు లేదన్నారు. ఇప్పటికైనా మైక్రోఫిల్టర్ సిస్టమ్‌లు రిపేరు చేసి వెంటనే శుద్ధి చేసిన మంచినీటిని గ్రామాలకు అందజేయాలన్నారు. సీపీఎం మండల కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి, నాయకులు రామాంజనేయులు, గోవిందు, విరుపాక్షి, హనుమంతరెడ్డి, తాయప్ప, గోవింద్‌రెడ్డి, ఉసేని, ఆంజనేయ, అన్వర్‌బాషా, రవి, హుసేని తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ ట్యాంకులోని నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పీహెచ్‌సీ ఎదురుగానే చెత్త చెదారం

- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు

గోనెగండ్ల: ఆరోగ్యం మాట దేవుడెరుగు ఆ ఆస్పత్రికి వెళితే ముందుగా చెత్త చెదారమే దర్శనమిస్తుంది. దీంతో లేని రోగాలంటుకుంటాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి ముందు దిబ్బలా మార్చేశారు. ఆస్పత్రి గేట్ ముందు చెత్త వేయడం, కాంపౌండ్ వాల్‌కు అనుకొని మూత్ర విసర్జన చేయడంతో లోపలికి వెళ్లాలంటే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇది గోనెగండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పరిస్థితి. బస్టాండ్ సమీపంలో ఆస్పత్రి ఉంది. అయితే ఆ చుట్టుపక్కల దుకాణదారులు చెత్తను గేట్ ముందు వేస్తున్నారు. అధికారులు మనం–మన పరిశుభ్రత, స్వచ్ఛ సంకల్పం అంటూ చేపట్టే ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, ఊదరగొడతున్న ప్రసంగాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రతి నిత్యం మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారి వరకూ పర్యటించే ఈ ప్రాంతంలో అధ్వానంగా ఉన్నా పట్టించుకునేవారే లేకపోవడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గోనెగండ్ల ఆరోగ్య కేంద్రం ఎదురుగా చేసిన చెత్త

సమస్యలు పరిష్కరించాలి



ఆరోగ్య కేంద్రం గేట్ ముందే చెత్త వేయడం, కాంపౌండ్ వాల్ దగ్గర మూత్ర విసర్జన చేయడంతో ఆ చుట్టు పక్కల దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి పరిసరాల్లోనే ఇలా ఉంటే, అంటురోగాలు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే ఆస్పత్రిలోకి అంబులెన్స్ రావడానికి చాలా ఇబ్బందిగా ఉంది. అత్యవసర సమయంలో అంబులెన్స్ ఆస్పత్రి లోపలికి రావాలంటే అక్కడ ఏర్పాటు చేసుకున్న బంకులతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– సోమన్న, గోనెగండ్ల

ఆశల ఖరీఫ్‌కు సన్నద్ధం



వేరుశనగ విత్తనాలు సిద్ధం చేస్తున్న దృశ్యం



ట్రాక్టర్‌తో పొలాన్ని చదును చేస్తున్న రైతన్న

పంట మార్పిడితో మెండుగా ప్రయోజనాలు

- భూసారం పెరుగుదల
- చీడపీడల నుంచి రక్షణ
- విత్తనశుద్ధి తప్పనిసరి

కోసిగి: రైతులు తమ పొలాలలో ఏటా ఒకే రకమైన పంటను సాగుచేయడం ద్వారా భూసారం తగ్గిపోతోంది. పంట పొలాలకు పెట్టుబడి పెరిగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గుతున్నాయి. దీంతో రైతన్నలు నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోతే చీడపీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుంది. 2 లేక 3 ఏళ్లలోపు పంటలను మార్పిడి చేసి వేరు పంటను వేసుకోవడం మంచిదని వ్యవసాయాధికారి రాజు సూచించారు. తద్వారా భూసారం పెంచి నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు.

అధికంగా పత్తి పంట సాగు

పంట సాగులో రైతన్న మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు విత్తన శుద్ధి చేసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌కు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్లు, ఎద్దులతో పొలాలను దుక్కి దున్ని సంసిద్ధం చేసుకుంటున్నారు. రైతన్నలు విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో పత్తితో పాటు వేరుశనగ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. నియోజకవర్గంలో 72 వేల హెక్టార్ల భూముల్లో రైతులు వివిధ పంటలు సాగుచేస్తారు. ఇందులో అత్యధికంగా పత్తి పంటను 32 వేలకు పైగా హెక్టార్లలో సాగుచేస్తారు. 22వేల హెక్టార్లలో వేరుశనగ సాగవుతుంది. వేరుశనగ సాగుకు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు. అలాగే రైతులకు గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు, జీలుగ, కందులు, పిల్లిపెసర విత్తనాలను అందించేందుకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మొదటి విడతగా రైతులకు అందుబాటులో ఉండేలా కోసిగి మండలంలో 210 క్వింటాళ్లు, కౌతాళంలో 120 క్వింటాళ్లు, మంత్రాలయంలో 30 క్వింటాళ్లు, పెద్దకడబూరు 230 క్వింటాళ్లు చొప్పున సబ్సిడీ వేరుశనగ విత్తనాలు కేటాయించారు. రిజిస్ట్రేషన్లు పూర్తి కాగానే రెండు రోజుల్లో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. రైతుల సౌకర్యార్థం విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

విత్తన శుద్ధితో ప్రయోజనాలు

- వేరుశనగ సాగు చేసే రైతన్నలు ముందుగా విత్తన శుద్ధి చేస్తే మంచి ప్రయోజనాలు పొందవచ్చును.
- ఒక కేజీ వేరుశనగ విత్తనానికి 3 గ్రాముల బావిస్టన్ లేక ఎం.45 లేదా సాఫ్ పొడి కలిపి విత్తన సాగుచేసుకోవాలి. దీంతో మెలకలు బాగా పెరిగి తెగుళ్లు రాకుండా నివారించవచ్చు.
- శుద్ధికి వినియోగించే మందులు విత్తనంలోకి చొచ్చుకొని పోయి శిలీంద్రాలను నాశనం చేస్తాయి. విత్తన శుద్ధి చేసిన తర్వాత మెలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయి.
- తక్కువ ఖర్చుతో పంటకు తెగుళ్ల సోకకుండా రక్షించుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విత్తన శుద్ధిలో తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలి. మోతాదుకు మించి ఉపయోగిస్తే విత్తనం మెలకెత్తే శాతం దెబ్బతింటుంది.
- విత్తనశుద్ధి చేసే సమయంలో రైతులు ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి.
- విత్తన సాగు తర్వాత 25 లేక 35 రోజుల్లోపు ఆకు పచ్చ తెగులు సోకకుండా కాంటఫ్ మందును స్ప్రే చేయవచ్చు.
- 90 రోజుల తర్వాత బావిస్టన్‌ను స్ప్రే చేస్తే ఆకు దృఢంగా ఉండి మంచి దిగుబడి సాధ్యమవుతుంది.

మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దు



వేరుశనగ పంట సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. భూసారాన్ని బట్టి పంటను సాగు చేయడం మంచిది. పంట సాగులో మోతాదుకు మించి ఎరువులు, మందులు ఉపయోగించరాదు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. విత్తనాలు కొనుగోలు చేస్తే బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను సందర్శించి పంట సాగులో సలహాలు, సూచనలు పొందవచ్చు.

– రాజు, వ్యవసాయాధికారి, కోసిగి